క్లుప్తంగా

బూచేపల్లిని కలిసిన రమణారెడ్డి



బూచేపల్లి వెంకాయమ్మతో కేవీ రమణారెడ్డి

చీమకుర్తి: జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించబడిన అనంతరం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో దర్శి ఏఎంసీ మాజీ చైర్మన్ కే వెంకటేశ్వరరావుతో పాటు కలిసిన రమణారెడ్డి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని బూచేపల్లి వెంకాయమ్మతో రమణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

ఒంగోలు, కొత్తపట్నం మండలాల పార్టీ అధ్యక్షుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడిగా మన్నె శ్రీనివాసరావును, కొత్తపట్నం మండల అధ్యక్షుడిగా లంకపోతు అంజిరెడ్డిలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వీరికి ఆయా మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

చీమకుర్తి: రైస్ గోడౌన్‌లలో పనిచేసే హమాలీల కూలిరేట్లు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గోడౌన్ వద్ద పనిచేసే హమాలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గురువారం చీమకుర్తిలో సీఐటీయూ మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వంలో హమాలీల కూలి రేట్లు రూ.25 నుంచి రూ.28కు పెంచుతున్నట్లు చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేసేందుకు జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలి

చీమకుర్తి రూరల్: ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలని చీమకుర్తి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.యాకోబు, ఏ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికై ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఒంగోలు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ధర్నాలో చీమకుర్తి మండలంలోని ఏపీటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని సునీల్ ప్రైమరీ స్కూల్లో గురువారం నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు దాత, నాయీ బ్రాహ్మణ సాధికారిక కమిటీ కన్వీనర్ డాక్టర్ కరేటి నరసింహారావు ప్యాడ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శివాజీ గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేసిన నరసింహారావును అభినందించారు. శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుంచాల ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయురాలు గుంటూరు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అడుగు బయటపెట్టాలంటే హడల్.!



- సంతనూతలపాడు మండలంలోని గ్రామాల్లో వీధికుక్కలతో ప్రజల బెంబేలు
- రోడ్లపైకి రావాలంటే జంకుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు

సంతనూతలపాడు: మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. కుక్కల సంఖ్యను నియంత్రించడంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో మండలంలో వాటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తరచూ చిన్నారులపై దాడి చేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే వెంటాడుతున్నాయని, ఎక్కడ కరుస్తాయోనని భయాందోళన చెందుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు గానీ, మండల స్థాయి అధికారులుగానీ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. సమస్యను అలాగే వదిలేయడంతో మరింత ఇబ్బందికరంగా మారింది.

ఇప్పటికే కోతుల స్వైర విహారం...

కొన్నాళ్లుగా కోతుల స్వైర విహారంతో మండలంలోని గ్రామాల ప్రజలు విసిగిపోయారు. ఏమీ చేయలేని స్థితిలో అష్టకష్టాలు పడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇంట్లోని వారు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా లోపలికి చొరబడుతున్నాయి. ఇళ్ల మధ్య సంచరిస్తున్న కోతులు కూరగాయలు, పండ్లు, డబ్బాల్లో ఉన్న వస్తువులు తీసుకెళ్లడమే కాకుండా ఇష్టానుసారంగా సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. వాటిని తోలేందుకు ప్రయత్నిస్తే మీదకు తిరగబడుతున్నాయి. అలాగే డిష్ వైర్లు, కేబుల్ టీవీ వైర్లు, నెట్ వైర్లను పట్టుకుని వేలాడుతూ తెంపేస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ తిష్ట వేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటి ఆవరణలోని మొక్కలను సైతం పీకేస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

కుక్కలతో కొత్త సమస్యలు...

కోతులకు తోడు ప్రస్తుతం గ్రామాల్లో వీధి కుక్కల బెడద ప్రజలను వేధిస్తోంది. కుక్కల సంతతి రోజురోజుకూ ఎక్కువైపోయి రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు వెళ్లేటప్పుడు విద్యార్థులను, ఒంటరిగా వెళ్లే వారిని, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ హడలెత్తిస్తున్నాయి. వీధి కుక్కల సంఖ్య పెరిగిపోయి వాటికి సరిపడా ఆహారం దొరక్క ప్రజలను కరిచేందుకు వస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు కేసుల సంఖ్య కూడా పెరుగుతోందని స్థానిక వైద్యులు చెబుతున్నారు. గతేడాది మండలంలో 600కుపైగా కుక్కకాటు కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సంతనూతలపాడు పీహెచ్‌సీ పరిధిలో నెలకు 70కిపైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. ఈ కేసులలో అధికంగా చిన్నారులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఉంటున్నారని హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. రహదారులపై రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో వారు తప్పించుకునే క్రమంలో వేగంగా వెళ్లి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్క కాటుకు గురైన చిన్నారికి సంతనూతలపాడు పీహెచ్‌సీలో టీకా వేస్తున్న సిబ్బంది

ప్రతి వీధిలో కనీసం 5 కుక్కలు...

మండలంలోని గ్రామాల్లో ప్రతి వీధిలో కనీసం 5 కుక్కలు తిరుగుతున్నాయి. ఇలా మండలంలో దాదాపు 500కుపైగా వీధి కుక్కలు ఉంటాయని అంచనా. ఆయా వీధుల్లో ఎవరైనా బైక్‌పై లేదా నడిచి వెళ్తుంటే వారిని కుక్కలు తరుముకుంటున్నాయి. దీంతో వారు నిత్యం ఆందోళనకు గురవుతున్నారు. చికెన్ వ్యర్థాలు లేని సమయంలో కుక్కలు మూగజీవాలతో పాటు ప్రజలపైనా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. మండలంలోని అనేక ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పశువులు కుక్కకాటుకు గురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మేకల మందలు, నాటు కోళ్లపై దాడి చేసి చంపేస్తున్నాయని పెంపకందారులు వాపోతున్నారు.



సంతనూతలపాడులోని హైస్కూల్, కాలేజీ రోడ్డులో సంచరిస్తున్న శునకాలు

నియంత్రణ చర్యలు శూన్యం

గ్రామాల్లో కుక్కల సంఖ్య నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో కుక్కల సంఖ్య పెరిగిపోయి వాటి బెడద ఎక్కువైంది. ప్రజలు కుక్కల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– శీలం అయ్యప్పరెడ్డి, సంతనూతలపాడు

వీధి కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం

గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వీధి కుక్కలతో తరచూ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కిలారి శ్రీనివాసరావు, సంతనూతలపాడు

అంగన్‌వాడీలకు శిక్షణ పూర్తి



మాట్లాడుతున్న ఏఎంఓ రమేష్

మద్దిపాడు: అంగన్‌వాడీ వర్కర్లకు ఏర్పాటు చేసిన జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ మొదటి విడత గురువారంతో ముగిసింది. మూడు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణలో మండలంలోని 60 మంది అంగన్‌వాడీ వర్కర్లు రెండు బ్యాచ్‌లుగా పాల్గొన్నారు. గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందారు. 0 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలను ఎలా అర్థం చేసుకోవాలి, బాల్యారంభ సంరక్షణ, విద్య, ఇటీవల భారత దేశంలో విద్యా విధానంలో కొత్తగా వచ్చిన పాలసీలు, పిల్లల స్వభావం, లక్షణాలు, మెదడు అభివృద్ధి, తదితర అంశాలపై డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలకు సృజనాత్మకత జోడించి చిన్నారులకు చక్కటి విద్య అందించాలని కోరారు. రెండో విడత శిక్షణ కార్యక్రమం త్వరలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, డీఆర్పీలు, ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యానాదులపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

చీమకుర్తి రూరల్: యానాదులపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం దేవరపాలెం పంచాయతీ పరిధిలో బక్కిరెడ్డిపాలెం యానాది కాలనీని సందర్శించారు. ఈ నెల 14న గ్రామంలోని యానాదులపై దాడి చేసిన అగ్రకులస్తులను వెంటనే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. యానాదులపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం మోహన్‌కుమార్‌ధర్మ ఎరుకులు, అణగారిన కులాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ప్రజాకవి పిన్నిక శ్రీనివాసరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు చింతలపాలెం యలమందబాబు, బహుజన నాయకుడు ఇస్తర్ల శంకర్ బహుజన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి రవి, గంటనపల్లి పోతురాజు, గిరిజన సంఘ నాయకుడు శీలం ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు బక్క రాజు, స్థానిక నాయకుడు గుర్తిరాజు, గిరిజన నాయకుడు కొమరిగిరి నారాయణ, చలంచర్ల అంజయ్య, బాపట్ల యంగయ్య, తోకల కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో బర్డ్ ఫ్లూ లేదు



కోళ్లఫారంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి మనురూప్

చీమకుర్తి రూరల్: మండల పరిధిలో బర్డ్ ఫ్లూ లేదని పల్లామల్లి పశువైద్యాధికారి టి.మనురూప్ తెలిపారు. గురువారం పల్లామల్లి పశువైద్యశాల పరిధిలోని బండ్లమూడి గ్రామంలో పలు కోళ్లఫారాలను తనిఖీ చేశారు. పలు కోళ్లను పరీక్షించి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని తెలిపారు. కోళ్లు చాలా ఆరోగ్యంగా ఉన్నాయని చెప్పారు. కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతూ షెడ్లలో కోళ్లు ఎటువంటి అనారోగ్య లక్షణాలతో కనిపించినా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. బర్డ్ ఫ్లూ లక్షణాలపై వారికి అవగాహన కల్పించారు. ఒకవేళ కోళ్లు చనిపోతే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాటి వ్యర్థాలను ఎలా పారవేయాలి, మిగతా కోళ్లకు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానులకు వివరించారు.

పంటలను ముంచిన కాలువ మరమ్మతులు

మద్దిపాడు: గుండ్లకమ్మ ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేస్తుండగా, నీటి ఉధృతి కారణంగా పక్కనున్న పంట పొలాలు గురువారం మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలకు మరమ్మతులు చేసి సాగునీరందిస్తే తమ పంటలకు సకాలంలో నీరందడి మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశించారు. కానీ, చేతికొచ్చిన పంట నష్టపోతామని అనుకోలేదంటూ మద్దిపాడు గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లకమ్మ కాలువలకు మార్చిలోపు మరమ్మతులు నిర్వహించాలని జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గుండ్లకమ్మ మెయిన్ కాలువలతో పాటు పంట పొలాలకు సాగునీటిని సరఫరా చేసే కాలువలకు కూడా మరమ్మతులు చేపట్టారు. మద్దిపాడు గడియాపూడి కాలనీ శివారులో గుండ్లకమ్మ కుడి కాలువ 10ఆర్ నుంచి దక్షిణం వైపు వెళ్లే పొలాలకు గుండ్లకమ్మ సాగునీటిని సరఫరా చేసే కాలువలో నాలుగు రోజుల నుంచి నాచు, జమ్ము తొలగింపు, పూడిక తీత పనులు చేపట్టారు. ఘడియపూడి, దొడ్డవరప్పాడు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కాంట్రాక్ట్ తీసుకుని పొక్లెయిన్‌తో మరమ్మతులు చేపడుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా పూడికతీత పనులు చేపట్టారు. దీంతో పంట కాలువలో నీటి ఉధృతి పెరిగి కాలువ పొంగి పక్కనే ఉన్న శనగ, పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటల్లోకి అధికంగా నీరు చేరింది. ప్రధానంగా శనగ పంట మునిగిపోయింది. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ అధికారులకు పరిస్థితిని వివరించగా, శనగ పంటకు నీరు మంచిదే కదా అంటూ మాట్లాడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు తమకు పంట నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు అంటున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: గ్రూప్–2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. గ్రూప్–2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, భద్రత, తనిఖీల విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

గ్రూప్–2 మెయిన్స్ ఇలా..

ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలోని 7 సెంటర్లలో ఈ నెల 23వ తేదీన జరుగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో జరిగే ఈ పరీక్షల్లో 4,544 మంది అభ్యర్థులు హాజరు కాబోతున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్‌లో 8801188046 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్సుకు ముందుగా ఏపీపీఎస్సీ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలు ఇలా..

మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 67 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 42,439 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 3 సిట్టింగ్ స్క్వాడ్స్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇద్దరు పరిశీలకులు కూడా వస్తున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలూ పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592–281275 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ

టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఇలా..

మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో చిన ఓబులేసు చెప్పారు. గురువారం ఆయన అధ్యక్షతన సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లాలో మొత్తం 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ చెప్పారు. వీరి కోసం 183 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 1,564 మంది, మార్చి 3 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. దీనిపై డీఆర్వో స్పందిస్తూ పరీక్షల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని, పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆయా కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రశ్నపత్రాల తరలింపు, విద్యార్థులు ప్రయాణించేందుకు అవసరమైన స్థాయిలో కంటైనర్లు, బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో తాగు నీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఎస్పీ అశోక్‌బాబు, డీటీసీ సుశీల, డీపీఓ వెంకట నాయుడు, ఎస్టీవో అక్కేశ్వరరావు, వైద్య, ఆర్టీసీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఓ ఓబులేసు

అంగవైకల్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

కొత్తపట్నం: అంగవైకల్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్యానల్ లాయర్ నాయుడు ఈశ్వర్‌రావు అన్నారు. పిల్లలు, వికలాంగుల సంరక్షణ కోసం ప్యానల్ లాయర్లు, పీఎల్‌ఆర్‌ఎస్, ఆశ కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమేతంగా గురువారం మోటుమాల హైస్కూల్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత ఇంటింటా సర్వే చేశారు. ఎన్ఏఎల్ఎస్ఏ అమల్లో భాగంగా అంగవైకల్యం తీవ్రతను తగ్గించాలని చెప్పారు. పీఎల్‌ఆర్‌ఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు అందరికీ సమాన న్యాయం చాలా అవసరమన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ అభినందనలు తెలిపారు. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపు ఇచ్చిన రోజని గుర్తు చేశారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.జోసఫ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచాలి

- రైతులను ప్రోత్సహించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ:

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్ కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి వ్యవసాయం, ఉద్యానవనం, ప్రకృతి సేద్యంపై స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో గురువారం అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మారిన జీవనశైలి వలన ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మార్పు తీసుకురావడానికి ఆహారమే ఔషధంగా పనిచేయాల్సి ఉందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా వచ్చే ఉత్పత్తులే ప్రధాన ప్రత్యామ్నాయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్ – 2047 డాక్యుమెంటులో కూడా సౌభాగ్యం, ఆరోగ్యం, సంతోషకరమైన రాష్ట్రం ఆవిష్కరణ లక్ష్యంగా పేర్కొన్నట్లు తెలిపారు. మనం తీసుకుంటున్న ఆహారంపై దృష్టి సారిస్తే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలమన్నారు. ఆర్గానిక్ సేద్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ కూడా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో ప్రకృతి సేద్యాన్ని కూడా ఒక చర్చనీయాంశంగా చేర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తక్కువ స్థలంలో పెరటి సాగుపై అవగాహన కల్పించాలన్నారు. రైతులకు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు ఇప్పించాలని, సాగులో పాటించాల్సిన మెళకువల గురించి మొబైల్ యాప్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. ఆ దిశగా తీసుకుంటున్న చర్యలను, జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ద్వారా అందిస్తున్న సేవలను ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి వివరించారు. అనంతరం ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి గోపీనాథ్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఆయా శాఖల డీపీఎంలు, ఏఓలు, హెచ్‌వోలు, ఏపీఎంలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

వచ్చే నెల 20 తర్వాత సమ్మెకు వెళ్తాం..

ఒంగోలు టౌన్: పౌర సరఫరాల సంస్థలో పనిచేస్తున్న హమాలీలకు పెరిగిన కూలి రేట్లను ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, లేకుంటే మార్చి 20 తర్వాత సమ్మెకు వెళ్తామని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు చెప్పారు. గురువారం నగరంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి వేతనాలు పెరగాలని, వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఒప్పందం చేసినా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. పీఎఫ్ సమస్య పరిష్కరించడంలో పౌరసరఫరాల సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. హమాలీలు సంజీవయ్య, వెంకట్రావు, చంద్ర, సుబ్బారావు, ఏసురత్నం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చర్చ జరగకుండా బడ్జెట్ ఆమోదించడం దుర్మార్గం

ఒంగోలు టౌన్: నగరాభివృద్ధికి సంబంధించి ఎలాంటి చర్చ జరగకుండా ఏకపక్షంగా బడ్జెట్‌ను ఆమోదించుకోవడం దుర్మార్గమని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం ఒక గంటలోనే బడ్జెట్ చర్చను ముగించడం పాలకవర్గం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేల మెప్పు కోసం గంటల తరబడి ఆలస్యంగా సమావేశం ప్రారంభించడం కౌన్సిల్ సభ్యులను అవమానించడమేనని, ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. రూ.210 కోట్లతో రూపొందించిన బడ్జెట్లో తాగునీరు, పారిశుధ్యం పనులకు తగినంత నిధులు కేటాయించలేదని, శివారు ప్రాంతాలను పట్టించుకోలేదని విమర్శించారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి 40 శాతం నిధులు కేటాయించాలని, పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచేందుకు అదనపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.